సాక్షి
జగిత్యాల

ఆదివారం । 13 ఆగస్టు । 2023

‘ఆధునిక’ పంచాయతీలు

- విశాలమైన గదులు
- సమావేశాలకు ప్రత్యేక హాళ్లు
- మోడల్ మరుగుదొడ్లు
- పల్లెవాసులకు తొలగుతున్న ఇబ్బందులు

కథలాపూర్(వేములవాడ): పల్లె పాలనలో కీలకమైనవి గ్రామపంచాయతీలు. గతంలో ఒకట్రెండు గదులకే పరిమితమైన కార్యాలయాలు.. ఇప్పుడు ఆధునిక వసతులతో అందుబాటులోకి వస్తున్నాయి. సర్పంచ్, కార్యదర్శులకు ప్రత్యేకంగా గదులు నిర్మిస్తున్నారు. ఉన్నతాధికారులు వస్తే సమావేశమయ్యేందుకు సువిశాలమైన హాళ్లు కేటాయిస్తున్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లనూ అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



మెట్‌పల్లి మండలం విట్టంపేట్ గ్రామపంచాయతీ భవనం

జిల్లాలో 380 గ్రామాలు..

- జిల్లాలో 20 మండలాలు, 380 గ్రామాలు ఉన్నాయి.
- గతేడాది చివర, ఈఏడాది జూన్‌లో ఈజీఎస్ ద్వారా 137 గ్రామాలకు కొత్త భవన నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.20 లక్షల చొప్పున కేటాయించారు.
- ఇప్పటి వరకు 8 గ్రామపంచాయతీ భవనాలు అందుబాటులోకి వచ్చాయి. గ్రామస్తులకు పాలన అందిస్తున్నాయి.
- 65 గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి.
- కొన్ని పల్లెల్లో స్థలాల కొరతతో పనులు ఇంకా ప్రారంభించలేదు.
- పలు గ్రామాల్లో నిర్మాణాలకు భూమిపూజ చేశారు. అక్కడ కూలీల కొరతతో పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడంలేదు.

వసతులు ఇవే..

సర్పంచ్, కార్యదర్శికి వేర్వేరుగా ప్రత్యేకంగా గదులు నిర్మిస్తున్నారు. స్టోర్‌రూం, మీటింగ్ హాల్, కామన్ హాల్, మరుగుదొడ్లు ప్రత్యేకంగా నిర్మిస్తున్నారు. వీటన్నింటా ఆకర్షణీయమైన మార్బుల్ వినియోగిస్తున్నారు. కళ్లు మిరమిట్లు గొలిపేలా ఎల్‌ఈడీ లైట్లు అమర్చుతున్నారు. పనుల కోసం పంచాయతీ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు నేరుగా సర్పంచ్, కార్యదర్శులను కలుసునేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నారు. సంక్షేమ పథకాల గురించి వివరించేందుకు కామన్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తారు.

అన్ని వసతులు కల్పించాలి



గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో పంచాయతీలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రతీ కార్యాలయంలో మౌలిక వసతులు కల్పించాలి. కొత్తగా నిర్మించే వాటిలో ఆధునిక వసతులు కల్పించడం మంచిదే. పాత గ్రామపంచాయతీ భవనాలు ఉన్నచోట అదనంగా గదులు నిర్మించాలి. అందులో గ్రంథాలయానికి ఒకగది కేటాయిస్తే యువకులు, విద్యార్థులు పోటీ పరీక్షల పుస్తకాలు, ఇతర పుస్తకాలు చదువుకునే వీలుంటుంది.

– గాంధారి శ్రీనివాస్, యువజన సంఘాల నేత

మోడల్ భవనం



మా గ్రామపంచాయతీ భవనంలో గతంలో రెండే గదులు ఉండేవి. చెట్టు కింద సమావేశాలు పెట్టుకునే వాళ్లం. కొత్త భవన నిర్మాణానికి గతేడాది రూ.20 లక్షలు మంజూరయ్యాయి. నిబంధనల మేరకు ఆధునిక వసతులతో భవనం నిర్మించాం. అన్ని వసతులు అందుబాటులోకి వచ్చాయి. చాలా సంతోషంగా ఉంది.

– ధర్మపురి జలేందర్, సర్పంచ్, పోతారం

డిసెంబర్ వరకు పూర్తి

జిల్లాలోని 137 గ్రామాలకు పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. ఇందులో కొన్నిపూర్తయ్యాయి. మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. స్థలం సమస్య ఉన్నచోట పరిష్కరించాలని సర్పంచులు, కార్యదర్శులకు సూచించాం. కొత్తగా మంజూరైన భవనాలు అన్నింటినీ ఈ ఏడాది డిసెంబర్ వరకు పూర్తిచేస్తాం. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

– రహమాన్, ఈఈ, పంచాయతీరాజ్,

న్యూస్‌రీల్

ఆయుష్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


మొక్క నాటుతున్న రవి నాయక్

మల్యాల(చొప్పదండి): దీర్ఘకాలిక వ్యాధులకు యునాని వైద్యం దివ్య ఔషధమని, ఆయుష్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ రవి నాయక్ సూచించారు. స్థానిక యునానీ ఆస్పత్రి ఆవరణలో శనివారం ఆయన మొక్క నాటారు. రవి నాయక్ మాట్లాడుతూ, యునానీ ఆస్పత్రిలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. తద్వారా పిల్లలు, మహిళలు, వృద్ధులకు యోగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కార్యక్రమంమలో ల్యాబ్ అసిస్టెంట్ ఉమాపతి పాల్గొన్నారు.

బేషరతుగా క్రమబద్ధీకరించండి


నిరసన తెలుపుతున్న రెండో ఏఎన్‌ఎంలు

జగిత్యాలటౌన్: రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలను బేషరతుగా క్రమబద్ధీకరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి డిమాండ్‌చేశారు. గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం సేవలు అందిస్తున్న రెండో ఏఎస్‌ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎనిమిదోరోజు శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట వంటావార్పుతో ఏఎన్‌ఎంలు నిరసన తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేపట్టిన ఏఎన్‌ఎంలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజారోగ్య సంరక్షణలో ముందున్న ఏఎస్‌ఎంల సేవలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెండో ఏఎస్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు గాండ్ల మధురిమ, నాయకులు గూడూరి జయప్రద, మమత, పద్మ, స్వరూపరాణి, సుమలత, ఎలిజబెత్, రాజమణి, మధులత తదితరులు పాల్గొన్నారు.

నియామకం


దారం ఆదిరెడ్డి

మల్యాల(చొప్పదండి): రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడిగా ముత్యంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దారం ఆదిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్వర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. తన నియామకానికి కృషి చేసిన పలువురు నాయకులకు ఆదిరెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

మిగిలింది ఐదురోజులే

- లిక్కర్‌షాపుల టెండర్లకు అనాసక్తి
- గతంతో పోల్చితే భారీగా తగ్గిన దరఖాస్తులు
- వేచిచూసే ధోరణిలో వ్యాపారులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మద్యం షాపుల టెండర్ల దరఖాస్తులు మందకొడిగా సాగుతున్నాయి. 2023–25 ఆర్థిక సంవత్సరాలకు మద్యం షాపుల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఈనెల 4 నుంచి దరఖాస్తుల స్వీకరణ ఎక్సైజ్‌శాఖ చేపట్టింది. ఈనెల 18నాటికి వరకు చివరి తేదీ. ఈ సారి రెండు వారాల గడువు ఇవ్వడంతో ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల సంఖ్య తగ్గింది. చాలా మంది మద్యం వ్యాపారులు వేచి చూసే ధోరణిలో ఉన్నట్లుగా తెలుస్తోంది. దరఖాస్తుల సంఖ్య పెంచేలా ఎక్సైజ్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

తగ్గిన దరఖాస్తులు..

ఉమ్మడి జిల్లాలో జగిత్యాలలో 71షాపులకు ఇప్పటి వరకు 210 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ జిల్లాలో 94 షాపులకు గాను 385, పెద్దపల్లిలో 77 షాపులకు 121 దరఖాస్తులు, సిరిసిల్లలో 48షాపులకు గాను 439 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 18వరకు గడువు ఉండటంతో చాలామంది వ్యాపారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. చివరి తేదీనాటికి ఆయా షాపులకు వచ్చిన దరఖాస్తులు, డిమాండ్ ఉన్న షాపులను దృష్టిలో ఉంచుకుని టెండర్‌లో పాల్గొనాలని చూస్తున్నారు. అయితే చివరిరోజు 60 నుంచి 70శాతం దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో మద్యం షాపుల దరఖాస్తులు (శుక్రవారం నాటికి)

జిల్లా	దరఖాస్తులు	షాపులు
జగిత్యాల	210	71
కరీంనగర్	385	94
పెద్దపల్లి	121	77
సిరిసిల్ల	439	48

డిమాండ్ ఉన్న షాపులపై నజర్

చాలా మంది మద్యం వ్యాపారులు డిమాండ్ ఉన్న షాపులపై దృష్టి సారించారు. ఇంకో ఐదురోజుల సమయం ఉండటంతో డిమాండ్ ఉన్న షాపుల్లో ఎక్కువ దరఖాస్తులు వేటికి వచ్చాయి, ఏఏ షాపులకు దరఖాస్తు చేయాలనే అంశాలపై దృష్టి పెట్టారు. ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్లలో అత్యధికంగా 439 దరఖాస్తులు వచ్చాయి.

సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూఎస్‌పీసీ ప్రతినిధులు డిమాండ్‌చేశారు. కలెక్టరేట్ ఎదుట శనివారం వారు నిరసన తెలిపారు. అనంతరం మాటాలాడరు. గత జూన్ 30వ తేదీతో పీఆర్సీ గడువు ముగిసిందని వారు తెలిపారు. వెంటనే కొత్త పీఆర్సీ ప్రకటించాలని, మధ్యంతర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఈపీ– 2020లోని లోపాలను పరిష్కరించాలని అన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు బేసిక్ పే చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శ్యామ్‌సుందర్, రాంచందర్, శంకర్‌బాబు, నరేందర్, అంబటి భూమేశ్వర్, రఘుపతియాదవ్, బన్న, రవీందర్, రాజేందర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్, రవి, కృష్ణరాజన్, రాజశేఖర్, ఫక్రొద్దీన్, రాజిరెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి వాయినం

కోరుట్ల: జూనియర్ కాలేజీ గ్రౌండ్ సమీపంలోని దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో శనివారం అమ్మవారికి అధికమాసం వాయినం ఇచ్చారు. 33 రకాల వంటకాలను దుర్గాదేవికి నైవేద్యంగా సమర్పించారు. మహిళా భక్తులతోపాటు కౌన్సిలర్ పెందెం గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నకు తమ్ముడి కిడ్నీ



సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన పబ్బతి విజయేందర్‌రెడ్డి(53) రైతు. షటిల్ ఆడేవాడు. ఉన్నట్టుండి వాంతులయ్యాయి. ఆస్పత్రికి వెళ్లగా కిడ్నీలు ఫెయిలయ్యాయని వైద్యులు నిర్ధారించారు. డయాలసిస్‌కు నెలకు రూ.40వేల నుంచి రూ.60వేల వరకు ఖర్చయ్యాయి. మూడు నెలలు గడిచాయి. విజయేందర్‌రెడ్డిని ఆస్పత్రిలో ఆ స్థితిలో చూసిన అతని తమ్ముడు జితేందర్‌రెడ్డి(50) తన రెండు కిడ్నీల్లో ఒకటి ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. హైదరాబాద్ ఆస్పత్రిలో ఆపరేషన్ అయింది. మృత్యువు ముంగిట అసహాయంగా నిల్చున్న అన్నకు ఆత్మీయ రక్తబంధం పునర్జన్మనిచ్చింది. విజయేందర్‌రెడ్డి ప్రస్తుతం జిల్లెల్లలో వ్యవసాయం, తమ్ముడు జితేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.

తొలి డోనర్ లక్ష్మి


ఇప్పనపెల్లి లక్ష్మి(ఫైల్)

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్లలోని గాంధీనగర్‌కు చెందిన ఇప్పనపల్లి నారాయణ, లక్ష్మి దంపతులు. మిర్చి బండి పెట్టుకుని జీవించేవారు. 12 ఏళ్లక్రితం పనులు ముగించుకుని ఇంటికెళ్లారు. అర్ధరాత్రి దాటాక విపరీతమైన తలనొప్పితో లక్ష్మి కింద పడిపోయింది. ఆమెను హైదరాబాద్‌లోని కిమ్స్‌లో చేర్పించారు. ఆమె బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవదానంపై అవగాహన కల్పించారు. ఆమె కుమారులు సంతోష్, రమేశ్ అంగీకారం మేరకు లక్ష్మి ఊపిరితిత్తులు, కాలేయం, గుండె, మూత్రపిండాలు సేకరించి నలుగురు వ్యక్తులకు అమర్చారు. జిల్లాలోనే తొలి అవయవ దాతగా లక్ష్మి గుర్తింపుపొందారు.

తండ్రి.. భార్య ఇద్దరూ దాతలే



కోరుట్ల: తండ్రి.. భార్య ఇద్దరూ కిడ్నీ దాతలుగా నిలిచారు. కోరుట్లకు చెందిన గీత కార్మికుడు పోతుగంటి శ్రీనివాస్ 2017లో వెన్నునొప్పితో అవస్థ పడడంతో తండ్రి రఘుగౌడ్ వైద్యులతో పరీక్షలు చేయించాడు. శ్రీనివాస్‌కు కిడ్నీ సమస్య ఉందని తేలడంతో కలవరపడ్డాడు. వైద్యులు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయకతప్పదని చెప్పడంతో రఘుగౌడ్ తన కిడ్నీదానం చేశాడు. శ్రీనివాస్ ఆరోగ్యం కుదుటపడింది. ఐదేళ్ల తరువాత 2022లో మళ్లీ వెన్నునొప్పి మొదలైంది. మరోసారి పరీక్షించిన వైద్యులు మళ్లీ కిడ్నీ మార్చిడి చేయాల్సిందేనని చెప్పడంతో అతడి భార్య లావణ్య కిడ్నీ ఇచ్చింది. శ్రీనివాస్ తేరుకుని ప్రస్తుతం ఏ సమస్య లేకుండా తన పనులు తాను చేసుకుంటున్నాడు.

మరణించి.. జీవించి..

- అవయవదానానికి ముందుకొస్తున్న కుటుంబాలు
- ఉమ్మడి జిల్లా ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- నేడు ప్రపంచ అవయవ దాన దినోత్సవం

“ మనిషికి ఒకటే జన్మ.. అదే మనిషి అవయవాలకు మాత్రం రెండు జన్మలు. అవయవ దానం చేస్తే మరణించినా మరోసారి జీవించే అవకాశం ఉంది. ఒక్క మనిషి చనిపోతే గుండె, మూత్రపిండాలు, ప్యాంక్రియాస్, ఊపిరితిత్తులు, కాలేయం, పేగులు, చేతులు, ముఖం, కణజాలం, ఎముకమజ్జ, మూలకణాలు దానం చేసి మరో 8 మంది ప్రాణాలు కాపాడొచ్చు. దేశంలో మరణాల సంఖ్య అధికంగా ఉన్నా.. అవయవదాతలు ఆ స్థాయిలో ఉండడం లేదు. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు, బంధువుల ఆలోచనలు, ఆచారాలు, కట్టుబాట్లు, అవగాహన రాహిత్యంతో చాలామంది ముందుకు రావడం లేదు. 18ఏళ్లు దాటినవారు ఆర్గాన్స్ డొనేట్ చేయొచ్చు. నేడు ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రాణం పోసిన.. దాతల సహకారంతో బతుకుతున్న వారిపై..

ఈ వారం సండే స్పెషల్..



సండే స్పెషల్



అవయవదాతల‘అబ్బిడిపల్లె’


ప్రతిజ్ఞ చేస్తున్న గ్రామస్తులు(ఫైల్)

ఓదెల: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం అబ్బిడిపల్లె వాసులు మూకుమ్మడిగా అవయవదానానికి అంగీకరిస్తూ తీర్మానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అప్పటి కలెక్టర్ సంగీతకు లేఖ అప్పగించారు. అబ్బిడిపల్లెలో 600 జనాభా ఉంటుంది. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన కల్పించగా.. సర్పంచ్ ఒజ్జ కోమలత ఆధ్వర్యంలో తీర్మానం చేసి శభాష్ అనిపించుకున్నారు.

మెడికల్ కాలేజీకి మృతదేహం


మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబసభ్యులు, సదాశయ ప్రతినిధులు(ఫైల్)

కోల్‌సిటీ: గోదావరిఖని శివాజీనగర్‌కు చెందిన దేవకి పార్థసారథి (85) తన మరణానంతరం అవయవాలు దానం చేస్తానని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రం రాసిచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 27న అనారోగ్యంతో మృతి చెందగా.. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను ఐ బ్యాంక్‌కు, పార్థివదేహాన్ని రామగుండం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

ఏడుగురికి పునర్జన్మ


ఇమానుయేల్(ఫైల్)

కోల్‌సిటీ: తాను మరణించి మరో ఏడుగురికి పునర్జన్మిచ్చారు గోదారిఖనిలోని విద్యానగర్‌కు చెందిన సిరిసిల్ల ఇమానుయేల్(33). హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేసే ఆయన 2019 జనవరి 3న బైక్‌పై ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వారంపాటు మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు. ఆయన కుటుంబసభ్యులు ఆయన అవయవాలను దానం చేయగా.. ఏడుగురికి పునర్జన్మ లభించింది.

నలుగురికి ప్రాణం



కోల్‌సిటీ: గోదావరిఖనిలోని ఎల్బీనగర్‌కు చెందిన మింగాని సంపత్(41) ఎమ్మెస్సీ, బీఈడీ చదివారు. ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీ డైరెక్టర్. 2019 జనవరి 14న రోడ్డు ప్రమాదానికి గురై కోమాలోకి వెళ్లి మరణించారు. నలుగురికి లివర్, రెండు కిడ్నీలు, గుండె అమర్చారు.

బతికుండగానే..



సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన పానగంటి స్వప్న(45) అంగన్‌వాడీ టీచర్. తాను చనిపోయాక తన అవయవాలు దానం చేయాలని భర్త నర్సయ్యతో చెబుతుండేది. తీవ్ర జ్వరంబారిన పడి చనిపోయిన ఆమె కోరిక మేరకు ఆమె రెండు కిడ్నీలు, గుండెను దానం చేశారు కుటుంబసభ్యులు.

దేహదానానికి నిర్ణయం


లింగమూర్తి, విజయ

కోల్‌సిటీ: గోదావరిఖని చంద్రబాబుకాలనీలో నివాసం ఉంటున్న మేరుగు లింగమూర్తి ఓసీపీ–3లోని బేస్ వర్క్‌షాప్‌లో ఆపరేటర్. ఎనిదేళ్ల క్రితం రెండు కిడ్నీలు చెడిపోయాయి. డయాలసిస్‌పై ఉన్న భర్త లింగమూర్తిని బతికించుకోవడానికి అతని భార్య విజయ తన కిడ్నీని దానంచేసింది. ఇప్పుడు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు. ఇదే స్ఫూర్తితో తమ మరణానంతరం తమ దేహాలను మెడికల్ కాలేజీకి దానం చేస్తామని సదాశయ ఫౌండేషన్‌కు అంగీకార పత్రాలు రాసి ఇచ్చారు.

కొడుకు కళ్లు సజీవం..



కోల్‌సిటీ: నా కొడుకు విజయ్‌పాల్‌రెడ్డి 2018 సెప్టెంబర్ 27న చనిపోయాడు. నేను, భార్య సుశీలతోపాటు నా కుటుంబ సభ్యులు దుఃఖంలో కూడా విజయపాల్‌రెడ్డి నేత్రాలను ఐ బ్యాంక్‌కు దానం చేశాం. నా భార్య, నేను కూడా మా మరణానంతరం నేత్రదానం చేస్తామని అంగీకారం తెలిపాం. చనిపోయిన వారి అవయవాలు మరికొందరికి ఉపయోగకరంగా ఉంటాయి. వారిలో మనవారిని చూసుకోవచ్చు.

– మారెల్లి రాజిరెడ్డి, యైటింక్లయిన్‌కాలనీ, గోదావరిఖని

తమ్ముడు తోడుండాలని..



కోరుట్లరూరల్: మాది మండలంలోని సంగెం. నాకు ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్లు. చిన్న తమ్ముడు చీటి రాంచందర్‌రావుకు 18ఏళ్ల క్రితం అనారోగ్యంతో రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. డయాలసిస్ చేసినా ప్రయోజనం లేదని డాక్టర్లు చెప్పారు. తమ్ముడిని కాపాడుకునేందుకు ఒక కిడ్నీ ఇచ్చా. కొంతకాలానికి తమ్ముడు అనారోగ్యంతో చనిపోయాడు. కిడ్నీ ఇచ్చిన నేను ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నా. అన్ని పనులు చేసుకుంటున్నా. తమ్ముడే దక్కలేదు.

– చీటి మురళీధర్ రావు, సంగెం, కోరుట్ల


రాష్ట్రం మొదటిస్థానం



కోల్‌సిటీ: అవయవదానంపై ప్రజల్లో చైతన్యం వచ్చింది. మన రాష్ట్రం దేశంలో అవయవదానంలో మొదటిస్థానంలో నిలిచింది. గోదావరిఖని ప్రాంతంలో ఎక్కువ మంది ముందకు వస్తున్నారు. 2008లో కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పురుడుపోసుకున్న సదాశయ ఫౌండేషన్.. రాష్ట్రవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అవయవదాతల కుటుంబాలకు, స్వచ్ఛంద సంస్థలకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

– టి.శ్రవణ్‌కుమార్, సదాశయ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు


మా ఆయన్ను దక్కించుకోవాలని..



విద్యానగర్(కరీంనగర్): మా వారు వారాల ఆనంద్. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. 2013లో ఆయనకు రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. వారానికి మూడు సార్లు డయాలసిస్ ఏడాదిపాటు చేయించుకోవాల్సి వచ్చింది. ఆయన్ను దక్కించుకునేందుకు నేను ఒక కిడ్నీ ఇచ్చేందుకు సిద్ధమయ్యా. నా కిడ్నీని ఆనంద్‌కు 15 జూలై 2014లో ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. నా జీవితంలో ఆయన లేని లోటును ఊహించలేను. నాలో భాగమైన ఒక కిడ్నీ ఇచ్చి బతికించుకున్నాను. ఇప్పుడు నేను, మావారు పిల్లలతో ఆనందంగా ఉన్నాం.

– వారాల ఇందిరారాణి, గృహిణి, కరీంనగర్

కొడుకు ప్రాణం పోశాడు



వేములవాడ: మాది వేములవాడ. కొన్నేళ్లక్రితం లివర్‌వ్యాధి ఉండేది. ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోయింది. నా కొడుకు మారుతి లివర్ నాకు సరిపోయింది. 17 నవంబర్ 2017న మారుతి లివర్‌లోని కొంత భాగాన్ని నా లివర్‌కు జతచేశారు. ఇప్పుడు ఇద్దరం ఆరోగ్యంగా ఉన్నాం. నా కొడుకు లివర్ ఇచ్చి నాకు ప్రాణం పోశాడు.

– కుమ్మరి శంకర్, వేములవాడ

పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో నేత్ర, అవయవ, దేహదానం వివరాలు

నేత్రదానం	850 మంది(సుమారు 1,700 మందికి కంటి చూపు వచ్చింది)
అవయవదానం	80 మంది(సుమారు 300 మందికి పైగా పునర్జన్మ)
మెడికల్ కళాశాలలకు దేహదానం	90 మంది
అవయవదానంపై అవగాహన కార్యక్రమాలు	950
అంగీకారం తెలిపిన వారు	50వేలకుపైగా..

అవయవదానంపై సేవలందిస్తున్న ప్రతినిధులు

టి.శ్రవణ్‌కుమార్	9948609591
సీహెచ్.లింగమూర్తి	9492781306
మేరుగు భీష్మాచారి	9849590415
బేణిగోపాల్ త్రివేది	9848218989
కె.శ్రీనివాస్	9849737100

క్లుప్తంగా

కుక్కలదాడిలో చిన్నారికి తీవ్రగాయాలు

కథలాపూర్(వేములవాడ): కుక్కలదాడిలో మూడేళ్ల చిన్నారికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. బీమారం మండలం కమ్మరిపేట గ్రామానికి చెందిన మూడేళ్ల చిన్నారి నక్కల రేయాన్షి శనివారం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో కుక్కల బెడద లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'ప్రవీణ్‌కుమార్ గృహ నిర్బంధం అప్రజాస్వామికం'

మెట్‌పల్లి: గ్రూప్–2 పరీక్షల వాయిదా కోసం సత్యాగ్రహ దీక్షకు సిద్ధమైన ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేయడం అప్రజాస్వామికమని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోటీ పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలిగేలా పరీక్షల తేదీలను నిర్ణయించడం ఎంతవరకు సమంజసమన్నారు. గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే ఆయన దీక్షకు సిద్ధమయ్యారన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే ప్రతిపక్షాల నాయకులను అణచివేయాలనుకునే బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు. అంతకుముందు ఆయన సమక్షంలో పలువురు బీఎస్పీలో చేరారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్, నవీన్, గంగారాం, రాజ్‌కుమార్, తదితరులున్నారు.

ఉర్దూలో బోర్డు రాయాలని ఆదేశాలు

కోరుట్ల : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ బోర్డులో ఉర్దూలో రాయించాలని ఆర్టీసీ కరీంనగర్ రీజినల్ మేనేజర్ శనివారం డిపో మేనేజర్‌కు ఆదేశాలు జారీచేశారు. ఆర్టీసీ బస్టాండ్ బోర్డు ఉర్దూలో కూడా రాయాలని పట్టణానికి చెందిన మహమ్మద్ ఆరీఫ్ రీజినల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆర్ఎం ఆదేశాలు జారీచేశారు.

వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే 'గృహలక్ష్మి'

జగిత్యాలటౌన్ : గతంలో ప్రభుత్వం సంక్షేమ పథకాల దరఖాస్తుకు ఆన్‌లైన్ విధానం అమలు చేయగా ప్రస్తుతం గృహలక్ష్మి పథకానికి ప్రత్యక్ష విధానం అమల్లో ఆంతర్యమేమిటని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే హడావుడిగా గృహలక్ష్మి పథకాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపించారు. గతంలో సొంత జాగాలో ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ప్రస్తుతం రూ.3 లక్షలకే ఇంటి నిర్మాణం ఎలా సాధ్యమో చెప్పాలన్నారు. ఇళ్ల మంజూరులో రేషన్‌కార్డు తప్పని సరికాగా నాలుగేళ్లుగా రేషన్ కార్డు మంజూరు చేయకపోవడంతో చాలామంది పేదలు అర్హత కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు, బీసీబంధు పేరిట ప్రజలను మభ్యపెట్టిన ప్రభుత్వం గృహలక్ష్మి పేరుతో మరో మోసానికి తెరలేపిందన్నారు. సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజంగి నందయ్య, పుప్పాల అశోక్, రమేశ్, జున్ను రాజేందర్, చందా రాధాకిషన్, ముంజాల రఘువీర్ గౌడ్, గుండ మధు ఉన్నారు.

'డాన్..డెన్'!

- ఇదీ లక్ష్మీరాజం హత్య కేసు నిందితుల తీరు..
- సెటిల్‌మెంట్లకు ప్రత్యేక ఇళ్లు
- అనుచరులంతా పాతికేళ్ల లోపువారే..

కోరుట్ల: ' అంతా సినీ ఫక్కీలోనే 'డాన్..డెన్' సంస్కృతి కొట్టొచ్చినట్లు కనిపించే తీరు.. ఊరికి చివరగా ఉండే రెండు మూడు అంతస్తుల బంగ్లాల అడ్డాలు. ఈ బంగ్లాల్లో కింది అంతస్థులో విత్తనాల నాగరాజుకు సమాచారం.. మద్యం ఇతరత్రా మత్తు పదార్థాలు సరాఫరా చేసే యువకులు.. ఆ పైభాగంలో మరో ఇద్దరు ముగ్గురు యువకులు.. చివరి అంతస్థులో విత్తనాల నాగరాజు. ఇలా పట్టణంలో రెండు మూడు చోట్ల అడ్డాలు వేసిన నాగరాజు తన కార్యకలాపాల కోసం తరచూ అడ్డాలు మార్చేవాడని పోలీసులు విచారణలో తేలింది. ఇంత పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకున్నా నేరానికి పాల్పడిన నిందితులు పోలీసులకు చిక్కకతప్పలేదు.

అనుచరులు పాతికేళ్లలోపే..

పోగుల లక్ష్మీరాజం హత్య కేసులో పోలీసులు శుక్రవారం చూపిన నిందితుల్లో ఐదుగురు పాతికేళ్ల లోపు యువకులే. వీరిలో ఒకరికి కేవలం 18 ఏళ్లు మాత్రమే ఉండటం గమనార్హం. గంజాయి, మద్యం మత్తుకు బానిసగా మారిన వీరు అక్రమమార్గంలో డబ్బులు సంపాదించాలన్న ఆశతో సెటిల్‌మెంట్లు, బ్లాక్‌మెయిల్, బెదిరింపులు, డబ్బులు వసూళ్లకు దిగిన సంఘటనలు అనేకమున్నట్లు ప్రచారం. అయిలాపూర్ రోడ్డులో చివరగా ఉండే నాగరాజుకు చెందిన ఓ బంగ్లాలో కోరుట్లలో రైస్‌మిల్ నడిపే ఓ యువకుడిని, అతనికి మద్దతుగా వచ్చిన మరో యువకుడి నగ్న వీడియోలు తీసి చితకబాది మరీ రూ.10 లక్షల వరకు డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఇదే తరహాలో ముత్యాలవాడలో ఓ చిన్నపాటి జ్యోతిష్యుడిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

మళ్లీ కస్టడీకి..

పోగుల లక్ష్మీరాజం హత్యకేసులో అరెస్టు అయిన వారిలో కొందరిని పోలీసులు మళ్లీ కస్టడీలోకి తీసుకోనున్నట్లు సమాచారం. లక్ష్మీరాజం హత్య కాకుండా ఇంకా ఏ నేరాల్లో పాలు పంచుకున్నారన్న దానిపై విచారణకు పోలీసులు సిద్ధమవుతున్నారు. నాగరాజు కేవలం సంచలనం కోసమే హత్య చేశాడని పోలీసులు నిర్ధారించినా బంధువులు, కుటుంబ సభ్యులు మాత్రం ఇంకా ఏ కారణాలతోనేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితులను మళ్లీ కస్టడీలోకి తీసుకున్నాక విచారణలో ఎలాంటి విషయాలు తెలుస్తాయోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అన్ని వర్గాలకు సీఎం కేసీఆర్ అండ

- మంత్రి కొప్పుల ఈశ్వర్



చెక్కులు అందజేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు అండగా ఉన్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని బీసీ కులవృత్తిదారులకు జిల్లా కేంద్రంలో శనివారం రూ.లక్ష సాయం చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు, ప్రజల సంక్షేమానికి కేసీఆర్ అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. తొలివిడతలో నియోజకవర్గానికి 300 మంది బీసీ కులవృత్తిదారులకు చెక్కులు అందిస్తామని చెప్పారు. రూ.లక్ష ఆర్థిక సాయం నిరంతర ప్రక్రియ అని వివరించారు. ప్రతీనెల లబ్ధిదారులను ఎంపిక చేసి సాయం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్‌బాషా, అదనపు కలెక్టర్ దివాకర, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, జెడ్పీటీసీలు మహేశ్, మనోహర్‌రెడ్డి, అశ్విని, ఎంపీపీలు ములాసపు లక్ష్మి, రాజేంద్రప్రసాద్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ రెగ్యులరైజేషన్ ఆర్డర్ కాపీలు అందజేశారు.

మంత్రి సమక్షంలో పంద్రాగస్టు

జిల్లాకు చెందిన మంత్రి కొప్పుల ఈశ్వర్ ఈనెల 15న నిర్వహించే స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా జతీయ పతాకం ఎగురవేస్తారని సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా కేంద్రంలోని ఖిలాలో జరిగే వేడుకల సందర్భంగా ఆయన జెండా ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

లైసెన్స్ రెన్యూవల్ పేరిట ఫోన్‌కాల్స్

- అవన్నీ ఫేక్ అంటున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల: 'హలో సార్.. మీ షాపు లైసెన్స్ రెన్యూవల్ తేదీ ముగిసింది.. మీరు ఈరోజే రూ.2,800 చెల్లించాలి.. లేకుంటే మీ లైసెన్స్ రద్దవుతుంది' అని రెండు రోజులుగా ఫోన్‌కాల్స్ రావడం వ్యాపారుల్లో కలకలం రేపింది. గురు, శుక్రవారాల్లో పలువురు వ్యాపారులకు మున్సిపల్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి లైసెన్స్ కాలపరిమితి ముగిసిందని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌కాల్ చేస్తున్నారు. గూగుల్‌పే లేదా ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లించి లైసెన్స్ రెన్యూవల్ చేయాలని సూచిస్తున్నారు. ఎన్నడూ లేనిరీతిలో ఫోన్‌కాల్స్ వస్తున్నాయని అనుమానించిన కొందరు వ్యాపారులు.. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అప్రమత్తమైన అధికారుల అవి నకిలీలు చేస్తున్నారని, ఎవ రూ డబ్బులు చెల్లించవద్దని కమిషనర్ సూచించారు.

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న చెన్నమనేని శ్రీనివాస రావు

కోరుట్ల : ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని శ్రీనివాస రావు అన్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం గల్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో గల్ఫ్ భరోసా దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గల్ఫ్‌లో మృతిచెందిన కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వారి పిల్లల చదువులకు ప్రత్యేక ప్యాకేజీ ఇవాలన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం రూ.వెయ్యి కోట్లు నిధి ఏర్పాటు చేయాలన్నారు. ఏజెంట్ల చేతుల్లో మోసపోయిన వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని, నకిలీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భరోసా దీక్షకు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి నర్సింగరావు, వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. గల్ఫ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల రవిగౌడ్, నారాయణ రెడ్డి, గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు పొన్నం తిరుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌రావుపేట వాసికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న నిఖిలేష్

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్ రావుపేట గ్రామానికి చెందిన తిరుకోవెల నిఖిలేష్‌కు ఇండియన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీ ఆధ్వర్యంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. నిఖిలేష్ భాషా శాస్త్రంలో కాంపోజిషనాలిటీ అండ్ ప్రెడికేషన్ ఆఫ్ ప్రాపర్టీ కాన్సెప్ట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇన్ తెలంగాణ అనే అంశంపై పరిశోధన చేశారు. ఐఐటీ ఇండియా ఆధ్వర్యంలో శనివారం డాక్టరేట్ పట్టాతో సత్కరించారు. ఈ సందర్భంగా నిఖిలేష్‌ను పలువురు అభినందించారు.

లైబ్రేరియన్ డే వేడుకలు



లైబ్రేరియన్‌ను సన్మానిస్తున్న చైర్మన్

జగిత్యాలటౌన్: జిల్లా గ్రంథాలయంలో శనివారం లైబ్రేరియన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ లైబ్రేరియన్ కవితను శాలువాతో సత్కరించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా.గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

రాయికల్(జగిత్యాల): నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రామారావుపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 40 మంది కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలను అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగ కల్పనలో విఫలమయ్యారని విమర్శించారు. అనంతరం వర్షాలతకు దెబ్బతిన్న వంతెన పరిశీలించారు. ఎంపీటీసీ రాధ,నాయకులు గంగారెడ్డి, సుధీర్‌రెడ్డి, రాజేందర్, చిన్నరాజం, జలపతి, రమేశ్ పాల్గొన్నారు.

14 నుంచి ఉచితంగా గాంధీ చిత్రం ప్రదర్శన

జగిత్యాల: స్వాతంత్య్ర వజ్రోత్సవాల ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 24 వరకు రాష్ట్రంలోని అన్ని సినిమా థియేటర్లలో మహాత్మాగాంధీ చిత్రం ఉచితంగా ప్రదర్శించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2022లో వజ్రోత్సవాల ప్రారంభ సమయంలో కూడా గాంధీచిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించగా విద్యార్థులు తిలకించారు. ఈనెల 14 నుంచి ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుంది. ఆగస్టు 15న ఇండిపెండెన్స్‌డే సందర్భంగా చిత్రప్రదర్శన ఉండదు. 16 నుంచి 24 వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు చిత్ర ప్రదర్శన ఉంటుంది. థియేటర్ నిర్వాహకులు విద్యాశాఖ, రవాణా, సమాచార సంబంధాల శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీఈఐఆర్ అప్లికేషన్ వినియోగించాలి

- ఎస్పీ భాస్కర్



అభినందిస్తున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం:సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా ఆందోళన చెందకుండా సీఈఐఆర్ అప్లికేషన్ వినియోగిస్తే మళ్లీ పొందడం సులభమేనని ఎస్పీ భాస్కర్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత మూడు నెలల్లో సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా 609 ఫిర్యాదులు వచ్చాయని, ఇందులో 178 ఫోన్‌లను ట్రేస్ చేసి బ్లాక్ చేశామన్నారు. సుమారు రూ.10 లక్షల విలువైన 72 మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని బాధితులకు అందించామని చెప్పారు. యాప్ ఆవశ్యకత గురించి ప్రతీ ఠాణా పరిధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.

పట్టుదలతోనే లక్ష్య సాధన

యువతీయువకులు పట్టుదలతో శ్రమిస్తే లక్ష్యం సాధించవచ్చని ఎస్పీ భాస్కర్ అన్నారు. సివిల్ ఎస్సైగా ఎంపికైన కానిస్టేబుల్ అనూషను శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అభినందించారు. కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూనే ఎస్సైగా ఉద్యోగం సాధించాలన్న తపనతో శ్రమించిన అనూష విజయం సాధించడం ప్రశంసనీయమన్నారు. పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మహిళతో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్

ధర్మపురి: పట్టణంలోని చిరువ్యాపారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం మార్కెట్‌ను సందర్శించిన ఆయన చిరువ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికులను సంప్రదించకుండా మార్కెట్ నిర్మించారని, మార్కెట్ ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లకు తాళం వేయడమేంటన్నారు. కనీసం తాగేందుకు నీటి సౌకర్యం కూడా లేదన్నారు. వ్యాపారులు తమ సమస్యలను మంత్రి ఈశ్వర్‌కు తెలిపేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. మంత్రి ఈశ్వర్‌కు పార్టీ కండువాలు కప్పేందుకు ఉన్న సమయం ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు లేదన్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి మంత్రి కృషి చేయాలన్నారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు సంగన భట్ల దినేష్, వేముల రాజేశ్, సీపతి సత్యనారాయణ, అయ్యోరి మహేశ్, అప్పం శ్రవణ్, పోచయ్య, ఆశెట్టి శ్రీనివాస్, సుముఖ్, స్తంభంకాడి గణేశ్, ప్రశాంత్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితులు

జగిత్యాలక్రైం: ఉద్యోగాల పేరిట ఓ మహిళ పలువురికి కుచ్చుటోపీ పెట్టింది. చివరికి మోసపోయామని భావించిన వారు శనివారం పట్టణ పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రానికి చెందిన పడమళ్ల వర్ణ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి డబ్బులు వసూలు చేసింది. మల్యాల మండల కేంద్రానికి తోకల విజేందర్, విజయ, కొండూరి గంగారాజం, రాజశేఖర్, లక్ష్మణ్‌తోపాటు జగిత్యాల, జగిత్యాల రూరల్, సారంగాపూర్‌కు చెందిన సుమారు వందమంది నుంచి కలెక్టరేట్, కోర్టుల్లో అటెండర్, ప్రభుత్వ ఆస్పత్రిలో వార్డు బాయ్, ఇతర శాఖల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.50 వేల రు.2లక్షలు వసూలు చేసింది. డబ్బులు చెల్లించినా ఉద్యోగంలో ఇప్పించకపోవడంతో ఆమెపై ఒత్తిడి పెంచారు. కాగా ఆమె పరారు కావడంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు పట్టణ పోలీసులను ఆశ్రయించారు.

సమాజ సేవే లక్ష్యం

- ఎల్ఎం కొప్పుల ట్రస్ట్ చైర్మన్ స్నేహలత
- 29 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ
- హర్షం వ్యక్తంచేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు పంపిణీ చేసిన సైకిళ్లు

పెగడపల్లి: సమాజ సేవతో పాటు పేద కుటుంబాలను ఆదుకునేందుకే ఎల్ఎం కొప్పుల సోషల్ ఆర్గనైజర్ సర్వీస్‌ను ప్రారంభించినట్లు సంస్థ చైర్మన్ కొప్పుల స్నేహలత పేర్కొన్నారు. మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన 29 మంది పేద విద్యార్థులకు 29 సైకిళ్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాల నుంచి మండల కేంద్రానికి చదువుకునేందుకు వెళ్తున్న విద్యార్థులకు ఈ సైకిళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలనే ఉద్దేశంతో తమ ట్రస్టు ద్వారా సైకిళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. విద్యార్థులతోపాటు నిరుద్యోగ యువతకు పలు కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, నిరుపేద యువతుల వివాహానికి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎల్ఎం కొప్పుల ట్రస్టు సైకిళ్ల అందించడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇనుగండ్ల కరుణాకర్ రెడ్డి, ఎంపీపీ శోభ, ఏఎంసీ చైర్మన్ నిర్మల, సంస్థ మండల ఆర్గనైజర్ కుసుమ శంకర్, ఎంపీటీసీ రజిత, ఉపసర్పంచ్ సంతోష్, మాజీ ఎంపీటీసీ ఆనందం, బీఆర్ఎస్ నాయకులు మల్లారెడ్డి, వెంకన్న, రమణాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

- 15 రోజుల క్రితం బాలికపై కుక్కలదాడి
- హైదరాబాద్‌కు తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయిన చిన్నారి



సాహిత్య (ఫైల్)

గొల్లపల్లి: కుక్కదాడిలో ఓ చిన్నారి గాయపడగా చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన సంగెపు శంకర్–భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు సాహిత్య(12) లక్ష్మీపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. 15 రోజులకింద పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన చిన్నారిపై కుక్కదాడి చేసి గాయపరిచింది. చికిత్స నిమిత్తం జిల్లా ప్రధాన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నయం కావపోవండతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా వైద్యం కోసం రూ.30 వేలవరకు ఖర్చుచేశారు. నిరుపేద కుటుంబం కావడంతో చిన్నారిని ఇంటినుంచి ఆస్పత్రికి తీసుకెళ్తూ చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్యం క్షీణించడంతో వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో సాహిత్య మృతిచెందింది. భాగ్యలక్ష్మి కూలీ పనులకు వెళ్తూ ఇద్దరు కూతుళ్లను సాకుతోంది. శంకర్ రూ.3లక్షల అప్పుచేసి రెండు నెలలక్రితమే దుబాయ్‌కు వెళ్లాడు. కూతురు మరణవార్త తెలుసుకొని అక్కడినుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య



రాము మృతదేహం

జగిత్యాలక్రైం: పురుగుల మందుతాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల రూరల్ మండలం.. పొరండ్ల గ్రామానికి చెందిన అడ్డగట్ల కళావతి –సత్యం దంపతుల కుమారుడు రాము (21) పెయింటింగ్ పనిచేస్తున్నాడు. సొంతిల్లు, ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో కొద్దిరోజులుగా మానసికంగా బాధపడుతున్నాడు. రెండ్రోజుల క్రితం రాము స్నేహితుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్పందన లేదు. హన్మాజీపేట గ్రామ శివారులోని వాటర్‌ట్యాంక్ కింద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం పూజారి చూసి స్థానికులకు సమాచారం అందించాడు. మృతుడి మేనమామ కట్టికోల అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

కిడ్నాప్‌కు యత్నం



తల్లి శ్వేతతో నయ శ్రీ

కథలాపూర్(వేములవాడ): బీమారం మండలం మన్నెగూడెంలో ఓ చిన్నారిని కిడ్నాప్‌కు యత్నించడం కలకలం రేపింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ మండలం రేగుంటకు చెందిన బాగోజి హరీశ్– శ్వేత దంపతులకు కూతురు నయశ్రీ ఉంది. కొన్ని నెలలక్రితం మన్నెగూడెంకు వలస వచ్చారు. శనివారం శ్వేత ఇంట్లో వంట చేస్తుండగా పక్క గదిలో నయశ్రీ నిద్రిస్తుంది. ఓ వ్యక్తి చిన్నారిని ఎత్తుకెళ్తుండగా శ్వేత గమనించి ఆ వ్యక్తిని వెంబడించింది. నయశ్రీని కొద్దిదూరంలో వదిలి అక్కడే బైక్‌పై ఉన్న మరో ఇద్దరితో పారిపోయాడు. మేడిపెల్లి ఎస్సై చిరంజీవి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను , గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సీసీ పుటేజీని పరిశీలించారు.